# కమ్యూనిస్టు పార్టీ ఎలా ఉండకూడదు?







'వైల్డ్ స్వాన్స్' పేరుతో
యుంగ్ చాంగ్ రాసిన

**'అడవిగాచిన వెన్నెల'** పేరుతో
వెనిగళ్ళ కోమల అనువాదం చేసిన
పుస్తకానికి
విమర్శనాత్మక పరిచయం

## రంగనాయకమ్మ

# కమ్యూనిస్టు పార్టీ ఎలా ఉండకూడదు?

## 'అడవిగాచిన వెన్నెల'

పుస్తకానికి
విమర్శనాత్మక పరిచయం

## రంగనాయకమ్మ

స్వీట్ హోమ్ పబ్లికేషన్స్
76, లేక్-సైడ్ కాలనీ
(దుర్గం చెరువు దగ్గిర)
జూబ్లీ హిల్స్ పోస్టు
హైదరాబాదు - 500 033

**కమ్యూనిస్టు పార్టీ**
**ఎలా ఉండకూడదు?**


**రచనా కాలం :**
2008 నించీ
అప్పుడప్పుడూ.

ఇది, 'ఆంధ్ర ప్రభ' దిన పత్రికలో,
ఆదివారం సంచికల్లో,
2008, సెప్టెంబరు 14 నించీ,
ఒక సంవత్సరం పాటు
సీరియల్‌గా వచ్చింది.

పుస్తకంగా,
**1** వ ముద్రణ : 2009 అక్టోబరు
**2** వ ముద్రణ : 2011 డిసెంబరు

కంపోజింగ్ & పేజ్ మేకప్ :
**ఎమ్. శారద**

ముద్రణ :
చరితా ఇంప్రెషన్స్
1-19-1126/బి,
ఆజామాబాదు ఇండిస్ట్రియల్ ఏరియా,
హైదరాబాదు - 520 020.

**ప్రతులకు :**
అరుణా పబ్లిషింగ్ హౌస్
ఏలూరు రోడ్డు
విజయవాడ - 520 002
(ఫోన్ : 0866-2431181)

పేజీలు : 250
[రాయల్ సైజులో,
హార్డ్ బౌండ్‌తో]
ధర : 60 రూ.లు

**ఫొటోలు :**
'అడవిగాచిన వెన్నెల'
నించి కొన్నీ
ఇంటర్నెట్ నించి కొన్నీ



రంగనాయకమ్మ అడ్రసు :
76, లేక్ సైడ్ కాలనీ
(దుర్గం చెరువు దగ్గిర)
జూబ్లీ హిల్స్ పోస్టు
హైదరాబాదు - 500 033

# ముందు మాట

**మావో** నాటి చైనా కమ్యూనిస్టు పార్టీ మీదా, దాని పరిపాలన మీదా, తీవ్ర విమర్శలతో నిండిన పుస్తకం ఇది. రచయిత్రి, చైనా యువతి **యుంగ్ చాంగ్.** ఈమె చైనాలో పుట్టి పెరిగి, తన 26 వ ఏట పై చదువుల కోసం లండన్ వెళ్ళి, చదువు పూర్తి చేసుకుని, అక్కడే యూనివర్సిటీ ఉద్యోగంలో స్థిరపడింది. ఈమె తమ్ముళ్ళు కూడా అక్కడే ఉన్నత స్థాయి ఉద్యోగాలూ, వ్యాపారాలూ చేసుకుంటున్నారు.

"వైల్డ్ స్వాన్స్" (అడవి హంసలు) పేరుతో, 1991లో మొదటి సారిగా ఇంగ్లీషులో వచ్చిన ఈ పుస్తకాన్ని **వెనిగళ్ళ కోమల** గారు "అడవి గాచిన వెన్నెల" పేరుతో తెలుగులోకి అనువాదం చేశారు. (తెలుగు పుస్తకం, డెమ్మీ సైజులో, 630 పేజీలు. ప్రచురణ: రేషనలిస్ట్ వాయిస్ పబ్లికేషన్స్, హైదరాబాద్ - 40)

ఈ పుస్తకం, నవల కాదు. రచయిత్రి కుటుంబ చరిత్రా, చైనా దేశ చరిత్రా, కమ్యూనిస్టు పార్టీ చరిత్రా - అలా ఆ చరిత్రలన్నీ కొంత కొంత కలిసినది. ఈ పుస్తకం, చివరికి తేల్చిన సారాంశం - 'పెట్టుబడిదారీ విధానమే మానవులకు చాలా సుఖప్రదమైనది. కమ్యూనిజం అందుకు పనికిరానిది' అని! - ఈ అభిప్రాయానికి రావడానికి ఈ రచయిత్రికి చాలా బలమైన కారణాలు వున్నాయి. ఈమె తల్లిదండ్రులు, చైనా కమ్యూనిస్టు పార్టీలో ఆది నించీ సాధారణ కార్యకర్తలుగా ప్రారంభమై, ఉన్నతాధికారుల స్థాయి వరకూ నిజాయితీతో, అంకిత భావంతో, పని చేసిన వారు. కానీ వారు కూడా ఆ పార్టీ వల్లనే చెప్పలేనన్ని అవమానాలూ కష్టాలూ అనుభవించారు. అలాంటి అనుభవాలు అక్కడ ఒకటి రెండు కుటుంబాలవే కాదు. ఈ పుస్తకం ప్రకారం, అక్కడ అనేక మంది నిరపరాధులు చాలా బాధలు అనుభవించారు. ఆ పరిస్థితుల్లో పెరిగిన పిల్లలు, తమ తల్లిదండ్రుల కష్ట సుఖాల్నీ, తమ అనుభవాల్నీ మించి, ఇంకేదో సిద్ధాంతానికి విలువ ఇవ్వలేరు. ఈ రచయిత్రి విషయంలో కూడా అదే జరిగింది.

ఈ రచయిత్రి, మార్క్సిస్టు పుస్తకాలు కూడా చదివినట్టు ఒకటి రెండు వాక్యాల్లో చెప్పుకుంది. కానీ ఆ పుస్తకాల ద్వారా తను ఏం నేర్చుకుందో ఎక్కడా వివరించలేదు. ఈమె దృష్టిలో - మావో చాలా స్వార్థపరుడు ; చాలా

కిరాతకుడు. అతని విప్లవ చర్యలన్నీ బూటకం. మావోతో పోలిస్తే టెంగ్ సియావో పింగ్ పరమ సాత్వికుడు; పరమ మానవతా వాది; పరమ ఉత్తముడైన పరిపాలకుడు.

ఈమె మావో ని విమర్శించడానికి కొన్ని కారణాలైనా కనపడుతున్నాయి. కానీ టెంగుని కీర్తించడానికి 'న్యాయమైన' కారణం ఏదీ కనపడదు. టెంగు, చైనాని, పెట్టుబడిదారీ విధానానికి తిరిగి సంపూర్ణంగా లోబరచడమే ఈమెకు చాలా నచ్చింది. పెట్టుబడిదారీ విధానం లోనే శాంతి భద్రతలు వర్ధిల్లుతాయని ఈమెకు నమ్మకం కలిగింది.

చైనా కమ్యూనిస్టు పార్టీ చేసిన తప్పుల్ని ఈమె చూపిస్తోంది కాబట్టి, ఆ పార్టీని విమర్శించినందుకు అభ్యంతరం లేదు. కానీ, **ఆ తప్పులకు కమ్యూనిజాన్నే కారణంగా చేసినందుకే అభ్యంతరం.**

ఈ రచయిత్రికి కమ్యూనిస్టు సిద్ధాంతం తెలియదు. శ్రమ దోపిడీ గురించి తెలియదు. దోపిడీ ఆస్తి సంబంధాల గురించి తెలియదు. ఈమెకు తెలిసింది, చైనా కమ్యూనిస్టు పార్టీ మాత్రమే. ఆ పార్టీ చేసిన కార్యక్రమాల్లో అనేక తప్పులు కనపడి, అసలు 'కమ్యూనిజం' అనే సిద్ధాంతమే తప్పుల తడక సిద్ధాంతంగా కనపడింది. ఆ మూల సిద్ధాంతంలో తప్పు వుండబట్టే, దాన్ని ఆచరించడంలో కూడా తప్పులు జరిగినట్టు కనపడింది.

కానీ, ఏ సిద్ధాంతాన్ని తీసుకున్నా దానికో స్వభావం వుంటుంది - మంచిది గానో, చెడ్డది గానో; ప్రజలకు మేలు చేసేది గానో, కీడు చేసేది గానో. మొదట ఒక సిద్ధాంతానికి వున్న స్వభావం తెలిసి వుండాలి. ఒక మంచి సిద్ధాంతం పేరు చెప్పుకుంటూ ఒక వ్యక్తి గానీ, ఒక బృందం గానీ, ఒక సంఘం గానీ, ఆ సిద్ధాంతంతో పొసగని తప్పులు చేస్తూ వుంటే, ఆ తప్పుల్ని ఆ సిద్ధాంతానికి అంటగట్టకూడదు. అలాగే ఒక చెడ్డ సిద్ధాంతానికైనా కూడా ఇది వర్తిస్తుంది. ఒక మంచి వ్యక్తి, తను నమ్ముతూ వున్న సిద్ధాంతం ప్రజలకు మేలు చెయ్యలేని సిద్ధాంతం అని తెలియక, దాన్నే నమ్ముతూ, తన ఆచరణలో మాత్రం తన వివేకంతో ప్రజలకు మేలు కలిగే చిట్టి పొట్టి పనులు చేస్తూ వుంటే, ఆ 'మంచి'ని, ఆ సిద్ధాంతానికే వున్న మంచిగా, దానికి ఆపాదించ కూడదు.

సిద్ధాంతం మంచిదో చెడ్డదో మొదట తేలాలి. మంచి సిద్ధాంతం పేరు చెప్పుకునే వాళ్ళ ఆచరణ చెడ్డగా వుంటే, అది ఆ సిద్ధాంతం తప్పు అవదు.

హేతుబద్ధమైన వైద్య శాస్త్రం పేరు చెప్పుకుంటూ ఒక వైద్యుడు పిచ్చి వైద్యం చేస్తే, అది ఆ వైద్యుడి తప్పే గానీ ఆ వైద్య శాస్త్రం తప్పు అవదు. అలాగే, చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రజలకు హాని చేసే వికృతమైన పనులు చేసి వుంటే, అది ఆ పార్టీ తప్పే గానీ, అది 'కమ్యూనిజం' అనే సిద్ధాంతం తప్పు అవదు. ఆ మంచి సిద్ధాంతాన్ని ఆ పార్టీ అర్థం చేసుకోలేదనో, లేదా ఆ సిద్ధాంతాన్ని వదిలేసిందనో - అలాంటి అర్థాలకే రావాలి.

ఈ పుస్తకం, కమ్యూనిస్టు పార్టీ చేష్టలనే విమర్శిస్తూ, 'ఈ చేష్టలు, అసలు సిద్ధాంతంతో పొసిగే విధంగా లేవు' అనే ధోరణినే ప్రదర్శించి వుంటే, ఇది చాలా మంచి పుస్తకం అయ్యేది. కానీ ఈ పుస్తకం, కమ్యూనిస్టు సిద్ధాంతమే దుర్మార్గమైనదనీ, పెట్టుబడిదారీ విధానం బహు సుందరమైనదనీ, దారి పొడుగునా చెప్పుకుంటూ వచ్చింది. ఈ పుస్తకంలో ఈ సారాంశం దొరికి నందుకే ఈ అనువాదకురాలు ముగ్ధురాలైనట్టు కనపడుతోంది.

ఈ రచయిత్రి యుంగ్‌చాంగ్ చైనాని వదిలి ఇంగ్లండు వెళ్ళింది మొదట చదువు కోసమే. చైనాకి 'స్వేచ్ఛని' ప్రసాదించిన టెంగ్ కాలంలో. అనువాదకు రాలు, తన 'ముందు మాట'లో, "యుంగ్ చాంగ్ ... ఇరుకు జీవితానికి స్వస్తి పలికి బ్రిటన్ వెళ్ళగలిగారు. అక్కడ స్థిరపడ్డారు. అలా సంకెళ్ళు తెంచుకుని స్వేచ్ఛ వైపుకు పయనించారు" అని, చాలా సంతోషించారు. చైనాలో టెంగ్ ప్రసాదించినది కూడా పెట్టుబడిదారీ స్వేచ్ఛే అయినా, దాని కన్నా బ్రిటన్‌లో దొరికే మరింత పెట్టుబడిదారీ స్వేచ్ఛ అసలు సిసలు స్వేచ్ఛగా అనువాదకు రాలికి ఆనందం కలిగించింది.

ఈ పుస్తకాన్ని ఎవరు ఏ దృష్టితో అనువదించారనేది అనవసరం. దీన్ని తెలుగు పాఠకులకు అందించిన వారిని అభినందించాలి. అనువాదం చాలా సరళంగా, చాలా సృజనాత్మకంగా సాగింది. ఎక్కడ ఏ తెలుగు మాటలు పడాలో అవే పడ్డాయి. కానీ చారిత్రక విషయాల్లో అనేక చోట్ల వున్న అస్పష్టతల పొరపాట్లు, ఒరిజినల్ రచయిత్రివే అవుతాయి.

ఈ రచనలో ఒక ప్రత్యేకత - చాలా సహజమైన ప్రకృతి వర్ణనలు. అవి, వర్ణనల కోసం వర్ణనలు కావు. అవి, జీవిత సంఘటనలతో లీనమై పోయి సాగుతాయి. అవి కూడా ఆ ప్రాంత రాజకీయ సమాచారాల్ని ఇస్తూ వుంటాయి.

చైనా కమ్యూనిస్టు పార్టీ మీదా, మావో మీదా, తీవ్రమైన విమర్శలతో సాగిన

ఈ పుస్తకాన్ని మన కమ్యూనిస్టులందరూ చదివి, నిశితమైన చర్చలు చేసుకోవాలి. శ్రమ దోపిడీ సంబంధాలతో సాగుతూ వున్న ఏ దేశంలో అయినా, ఆ సంబంధాల్ని తీసి వేసే కార్యక్రమాలు జరగవలసిందే. ఆ కార్యక్రమాల్లో జరిగే తప్పుల్ని తెలుసుకోగలిగితేనే, ఇతర దేశాల కమ్యూనిస్టు పార్టీల చర్యల్ని పరిశీలించగలిగితేనే, రేపు ఈ దేశంలో సరైన కార్యక్రమాలు నిర్ణయించుకో గలుగుతాము. అందుకే ఇటువంటి విమర్శల పుస్తకాల పరిశీలన అత్యవసరం.

రష్యా, చైనా పార్టీల గురించి గతంలో కూడా అనేక పుస్తకాలు వచ్చాయి. అవన్నీ విదేశీ జర్నలిస్టులు ఆ దేశాల్లో పర్యటించి రాసిన పుస్తకాలు. కానీ ఇది చైనాలో పుట్టి పెరిగిన యువతి, మావో నాటి కమ్యూనిస్టు పార్టీలో అధికారులుగా పని చేసిన తల్లిదండ్రుల్ని కలిగిన వ్యక్తి రాసిన పుస్తకం. ఆ రకంగా దీనికి ప్రత్యేకత వుంది. ఈ పుస్తకానికి ఇంగ్లీషులో, 'వైల్డ్ స్వాన్స్' అనే పేరు ఎందుకు పెట్టారో తెలీదు గానీ, తెలుగు అనువాదానికి 'అడవి గాచిన వెన్నెల' అనే పేరు ఎందుకు పెట్టారో అర్థం చేసుకోవచ్చు. కమ్యూనిస్టు పార్టీ కోసం చేసిన కృషి అంతా, 'అడవి గాచిన వెన్నెల' అయిపోయిందని చెప్పడానికి కావచ్చు.

ఈ రచయిత్రి, ఈ పుస్తకాన్ని తన అమ్మమ్మ కాలంతో మొదలు పెట్టింది. తర్వాత, తన తల్లిదండ్రుల గురించీ, ఆ తర్వాత తన గురించీ. చివరికి లండన్‌లో స్థిరపడి ఊపిరి పీల్చుకోవడంతో ఇది ముగుస్తుంది. టెంగు పరిపాలన గురించి కూడా చివర్లో కొంత ఆశ్చర్యం ప్రకటించింది.

ఈ రచయిత్రి విమర్శ లేమిటో అర్థం చేసుకోవాలంటే, చైనాలో జపాన్ వాళ్ళ పాలనలోనూ, కొమింటాంగుల పాలనలోనూ వున్న అమ్మమ్మ కాలం నించీ కూడా చూసుకుంటూ వెళ్ళాలి. ఇక్కడ ఇస్తున్నదంతా అసలు పుస్తకానికి చాలా క్లుప్తమైన పరిచయం.

**పలకల బ్రాకెట్లలో వున్నవి - నా వివరణలూ, నా విమర్శలూ, నా వ్యాఖ్యానాలూ.**

ఈ పుస్తకం చదివిన తర్వాత గానీ, చదవక ముందే గానీ,
**' అడవి గాచిన వెన్నెల'** కూడా చదవండి!

**రంగనాయకమ్మ**
( 2008 సెప్టెంబరు )

7

# కమ్యూనిస్టు పార్టీ ఎలా ఉండకూడదు?

పద్నాలుగేళ్ళ యాంగ్ అనే అబ్బాయికీ, ఇరవయ్యేళ్ళ రుషాన్ అనే అమ్మాయికీ, పెళ్ళయింది. వరుడు చిన్నా, వధువు పెద్దా, పాత చైనాలో సాధారణ విషయమే. అప్పటి దాకా తల్లి దగ్గరే పడుకోవడం అలవాటైన ఆ అబ్బాయి, భార్య గదిలోకి పోవడానికి వెనకాడేవాడు. అయినా ఆ పెళ్ళి తర్వాత ఒక సంవత్సరానికే వారికి ఒక కూతురు పుట్టింది (1909లో). ఆ అమ్మాయి పేరు యుఫాంగ్. ఆ అమ్మాయే, ఈ పుస్తకం రాసిన రచయిత్రికి అమ్మమ్మ. 'యు' అంటే పచ్చ. 'ఫాంగ్' అంటే సుగంధ పుష్పం. ఆ పేరుకి తగ్గట్టే ఆ అమ్మాయి మెరిసే చర్మం రంగుతో, చక్కని రూపు రేఖలతో, చిన్నప్పటి నించీ అందగత్తె పేరుతో పెరిగింది.

ఆ కుటుంబం, మంచూరియా ప్రాంతంలో వున్న ఇషియాన్ పట్టణంలో వుండేది. ఆ ఇషియాన్, పెకింగ్‌కి ఈశాన్య దిక్కులో 250 మైళ్ళ దూరంలో వుంటుంది. అప్పుడు మంచూరియాతో పాటు మరి కొన్ని ప్రాంతాలు జపాన్ వాళ్ళ ఆధీనంలో వున్నాయి. అందులోనే ఒక్కో చిన్న ప్రాంతం, ఒక్కో మిలటరీ అధికారి పరిపాలనలో వుండేది.

యాంగ్, కొంత చదువు వున్నవాడు కాబట్టి, ఇషియాన్‌లో చిన్న పోలీసు ఉద్యోగం చేసేవాడు. అతనికి డబ్బు బాగా సంపాదించాలనే కోరిక వుండేది. దానికి ఏకైక మార్గంగా అందగత్తె అయిన తన కూతురు కనపడింది. ఆమెని హై క్లాసు కుటుంబాల పిల్లగా పెంచి, ఎవరైనా పెద్ద మిలటరీ అధికారికి ఉంపుడు కత్తెగా చెయ్యాలనుకున్నాడు. కూతుర్ని ఆడ పిల్లల స్కూల్లో చేర్చాడు. ఆ స్కూల్లో ఆ అమ్మాయి, చదువుతో పాటు, డ్రాయింగూ, ఎంబ్రాయిడరీ వంటి కళలు నేర్చుకుంది. చైనా చెస్ వంటి కొన్ని రకాల ఆటలు నేర్చుకుంది. సంగీతం పంతులు ఇంటికి వచ్చి క్విన్ వాయిద్యం మీద సంగీతం నేర్పేవాడు.

పాత చైనాలో ఆడపిల్లల అందానికి అసలు గుర్తు, పాదాలు మూడు అంగుళాల పొడవు కన్నా పెరగకుండా అతి చిన్నవిగా వుండడం! యుఫాంగ్‌కి మూడేళ్ళ వయసు నించీ ఆ క్రతువు మొదలు పెట్టారు. పాదాలకు, బొటన వేలు బైటికి పెట్టి, పెద్ద బండ గుడ్డ చుట్టేసి, ఆ కట్ల మీద పెద్ద పెద్ద రాళ్ళు పెడతారు. పిల్లలు ఏడుస్తోంటే నోట్లో గుడ్డలు కుక్కి, పిల్లలు స్పృహ తప్పే లాగ చేస్తారు. ఆ కట్లు అప్పుడప్పుడూ విప్పినా మళ్ళీ కట్టేస్తూ వుంటారు. పాదాల్ని ఎదగనివ్వరు. ఎన్నో సంవత్సరాల దాకా అది జరుగుతూనే వుంటుంది. పిల్ల ఏడుస్తూ వుంటే తల్లి కూడా ఏడుస్తూ, 'ఇది నీ మంచికేనమ్మా! నువ్వు అందంగా వుంటే, నీ భర్త నిన్ను బాగా చూసుకుంటాడు. ఉంపుడు కత్తెల్ని పెట్టుకోడు. నీ జీవితం బాగుంటుంది' అని బోధిస్తూ వుంటారు. యుఫాంగ్ తల్లికి కూడా చిన్న పాదాలే. ఆమె తల్లి ఆమెకి చేసిన బోధనలే ఆమె తన కూతురికి చేసింది.



యుఫాంగ్
(పెద్ద వయసులో)

పాదాలు చిన్నగా వున్న స్త్రీలు, తూలిపోతూ నడుస్తారు కాబట్టి, ఆ నడక, పాత చైనా పురుషులికి వయ్యారపు నడకగా కనిపించేది. ఆ చిన్న పాదాల్ని 'లిల్లీ పూలు' అంటారు. అలాంటి పాదాలు లేని కోడళ్ళని అత్తలు ఈసడిస్తూ వుంటారు, అత్తకి ఆ పాదాలు లేకపోయినా. ఆ చిన్న

పాదాల వాళ్ళు బతికినన్నాళ్ళూ వాటితో బాధలు పడుతూనే వుంటారు. ఆ ఆచారం యుఫాంగ్ కాలంలోనే మరుగై పోతూ వుంది. ఆమె తర్వాత ఐదారేళ్ళకి పుట్టిన రెండో పిల్లకి ఆ ఆచారం పాటించలేదు.

యుఫాంగ్‌కి 14 ఏళ్ళు దాటే సమయంలో, ష్యూ అనే యాభైయ్యేళ్ళ మిలటరీ అధికారి ఒకడు, ఇషియాన్‌లో వున్న తన ఆస్తులు చూసుకోవడానికి వచ్చాడు. అతను ఒక వార్ లార్డ్ (యుద్ధ ప్రభువు). అతని స్వంత పట్టణం లూలాంగ్. ఆ పట్టణంలో అతనికి 81 గదులతో మహా రాజప్రాసాదం లాంటి భవంతి వుంది. అనేక పట్టణాల్లో ఆస్తులు వున్నాయి. అతనికి ఎప్పుడో పెళ్ళి అయింది. భార్య వుంది. అనేక ఊళ్ళల్లో ఉంపుడుకత్తెలు వున్నారు. అంత గొప్ప లార్డ్ ఇషియాన్ వస్తున్నాడనే వార్త యాంగ్ చెవిన పడగానే, ఆ 29 ఏళ్ళ తండ్రి, తన 14 ఏళ్ళ కూతుర్ని, ఆ లార్డ్ దృష్టిలో పడేసే పథకాలన్నీ తయారు చేశాడు.

ఇషియాన్‌లో పూర్తిగా చెక్కతో కట్టిన 100 అడుగుల ఎత్తయిన బుద్ధుడి గుడి వుంది. జనరల్ ష్యూ అక్కడికి వచ్చేటప్పటికి, బుద్ధుడి విగ్రహం ముందు మోకరిల్లి వున్న యుఫాంగ్ అందమూ, ఆమె చిరు పాదాలూ, ఆ జనరల్‌ని ఆకర్షించాయి. ఆ తర్వాత ఒక థియేటర్‌లో జరిగిన నాటకం దగ్గిర, చిరు పాదాలతో రెప రెప లాడే ఆ యువతిని ఆ జనరల్ మళ్ళీ చూశాడు. ఆమె అక్కడ క్విన్ వాయిద్యం మీద పాటలు కూడా పాడింది. ఆ జనరల్ ఆ అమ్మాయిని ఉంపుడు కత్తెగా చేసుకుంటానన్నాడు. యాంగ్‌కి కావలసిందే అది.

ఆ ప్రయత్నాలన్నీ తండ్రి చేస్తూంటే యుఫాంగ్ చాలా ఏడ్చేది. కానీ తల్లి, 'ఆయన చాలా ధనవంతుడమ్మా! పెద్ద అధికారం గల వాడు. నిన్ను ఉంచుకుంటా ననడం నీ అదృష్టం. చాలా సుఖపడతావు' అని బోధించింది.

జనరల్ ష్యూ, యుఫాంగ్‌కీ, ఆమె తండ్రికీ, చాలా బహుమతులూ డబ్బూ ఇచ్చాడు. దట్టంగా అలంకరించిన మేనాలో, మేళతాళాలతో యుఫాంగ్, ఇషియాన్‌లోనే వున్న ష్యూ భవంతికి బైల్దేరింది. ష్యూ ఇచ్చిన బహుమతులు, ఆమె మేనా వెంట బళ్ళల్లో సాగుతోంటే జనం ఆమె అదృష్టానికి ఆశ్చర్యపోతూ విరగబడి చూశారు. యుఫాంగ్ కూడా 'ఇంత అదృష్టవంతురాలినా' అని విస్తుపోతూ ష్యూ భవంతికి చేరింది.


యుఫాంగ్‌ను 'ఉంచుకున్న' ష్యూ

ఆ భవంతి నిండా సేవకులూ, ఆ భవంతి చుట్టూ పూల తోటలూ. జనరల్ ష్యూ, పద్నాలుగేళ్ళ కొత్త ఉంపుడుకత్తెతో అక్కడ వారం రోజులే వున్నాడు. ఆ చిరుపాదాల అమ్మాయి, అతని వెడల్పాటి పాదాలు ఒత్తుతూ, అతనికి సంగీతం వినిపిస్తూ, ఆ రోజులు గడిపింది. అతను వెళ్ళిపోవడానికి బైల్దేరే ముందు ఆ అమ్మాయికి చాలా జాగ్రత్తలు చెప్పాడు. తనని మోసం చెయ్యడానికి ప్రయత్నిస్తే భయంకరమైన శిక్ష పడుతుందనీ, ఆమె ప్రవర్తన గురించి సేవకులు తనకి తెలియజేస్తూ వుంటారనీ చెప్పాడు. కావాలంటే నల్ల మందు అలవాటు చేసుకోవచ్చన్నాడు. నల్ల మందు మింగితే విచారాలు లేకుండా రోజంతా నిద్రపోతూ వుండవచ్చు. జనరల్ ఎక్కడికి వెళ్తున్నాడో, ఎప్పుడు వస్తాడో, ఆ అమ్మాయికి తెలీదు. అడగకూడదు. మౌనంగా ఎదురు చూడడమే ఆమె విధి.

అతను వెళ్ళిపోయాక, ఆ భవంతిలో, నిత్యం తనని గూఢచారులుగా పరిశీలించే సేవకుల మధ్య ఒంటరిగా గడిపేది. నల్లమందు జోలికి పోలేదు. కాలక్షేపం కోసం కథల పుస్తకాలు చదువుతూ, పూల మొక్కలు పెంచుతూ గడిపేది. తల్లిదండ్రుల ఇంటికి వెళ్ళి తన ఒంటరితనం గురించి చెప్పుకుంటే, తండ్రి మందలించేవాడు. "ఆయన నీ భర్త. ఆడమనిషికి కోడితో పెళ్ళయినా, కుక్కతో పెళ్ళయినా, దానికే విధేయతతో వుండాలి' అని బోధించే వాడు. ఆ తండ్రి, కూతురు ద్వారా సంపాదించిన డబ్బుతో కొంత

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=947**

* * *

**Read other books of Ranganayakamma @**

**http://kinige.com/kbrowse.php?via=author&id=181**